## యాసంగి సీఎమ్మార్‌ను వేగంగా అందించాలి

• డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ, జనవరి 30 : 2022-23 సంవత్సరానికి సంబంధించిన యాసంగి సీజన్ కస్టం మిల్లింగ్ రైస్ (సీఎమ్మార్)ను వేగంగా అందజేయాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు మిల్లర్లను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని రామ్ లక్ష్మణ్ మిల్లులో మంగళవారం బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించిన సీఎమ్మార్ ఇప్పటి వరకు వంద శాతం పూర్తి చేశామన్నారు. ఇదే ఏడాదికి సంబంధించిన యాసంగి సీఎమ్మార్‌ను కూడా త్వరలోనే సేకరిస్తామని చెప్పారు. అన్ని మిల్లుల్లో ధాన్యం నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించి సేకరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట సివిల్ సప్లై డీఎం నాగేశ్వర్‌రావు ఉన్నారు.

## రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

భువనగిరి అర్బన్, జనవరి 30 : ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులకు గురువారం నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు ఇంటర్ నోడల్ ఆఫీసర్ రమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 16నుంచి ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్, 17న ఎథిక్స్, మానవ విలువలు, 19న ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# జడ్పీ చైర్మన్‌పై దాడి దుర్మార్గం

• సందీప్‌రెడ్డిపై దాడిని ఖండిస్తూ ఉమ్మడి జిల్లాలో నిరసనలు
• పలుచోట్ల మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మల దహనం
• పోలీసుల తీరుపై డీజీపీకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్
• కోమటిరెడ్డి తీరును ఖండించిన స్థానిక ప్రజా ప్రతినిధులు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై జరిగిన దాడి పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలకు దిగారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మంత్రి ఆదేశాలతో పోలీసులు వ్యవహరించిన తీరుపై మంగళవారం బీఆర్ఎస్ నేతలు డీజీపీకి ఫిర్యాదు చేశారు. మంత్రి హోదాను మర్చి వ్యవహరించిన కోమటిరెడ్డి తీరు దుర్మార్గమని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ ఖండించారు. ప్రజాస్వామానికే మచ్చ లాంటి ఘటన అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ వ్యాఖ్యానించారు.

### తీవ్రమైన చర్యగా భావించిన బీఆర్ఎస్

బీబీనగర్ మండలం గూడూరు గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల ఎదుటే జిల్లాలోనే అత్యున్నత ప్రొటోకాల్ కలిగిన జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై దాడికి పురిగొల్పడాన్ని తీవ్ర చర్యగా భావిస్తూ రంగంలోకి దిగింది. ఘటన జరిగిన వెంటనే సోమవారమే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గ్యారెంటీల అమలును కోరితే దాడులు చేయిస్తారా అని ప్రశ్నించారు. సందీప్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. మంత్రి కోమటిరెడ్డి అహంకార పూరిత ధోరణిని తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సందీప్‌రెడ్డితో మాట్లాడి కోమటిరెడ్డి వ్యవహారశైలిపై తీవ్రంగా స్పందించారు. మంత్రి స్థాయిని మర్చి దిగజారి ప్రవర్తించడం మంచిదికాదంటూ హితువు పలికారు. ఇక మంగళవారం ఇదే ఘటనపై బీఆర్ఎస్ జిల్లా ముఖ్యులతో కలిసి రాష్ట్ర పార్టీ ప్రతినిధులు, ఎలిమినేటి సందీప్‌రెడ్డి రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనను వివరిస్తూ, మంత్రి వ్యవహార శైలిని, పోలీసుల అత్యుత్సాహాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎల్.రమణతోపాటు ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, గుజ్జ దీపికా యుగేంధర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి డీజీపికి ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. ఇక నల్లగొండ పట్టణంలో బీఆర్ఎస్వీ నేత బొమ్మరబోయిన నాగార్జున ఆధ్వర్యంలో, బొమ్మలరామారంలో బీఆర్ఎస్ శ్రేణులు సందీప్‌రెడ్డిపై దాడికి నిరసనగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి జిల్లా అంతటా కోమటిరెడ్డి వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది.



నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

## సందీప్‌రెడ్డికి కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి

• కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
• బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

దేవరకొండ, జనవరి 30 : వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాలయాపన చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలోని ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకాలు అమలు చేయకుండా, అడిగిన వారిపై మంత్రి కోమటిరెడ్డి సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేటికీ అమలు చేయలేదన్నారు. హామీల గురించి ప్రశ్నించిన జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డిపై కోమటిరెడ్డి అహంకార పూరితంగా మాట్లాడడం తగదని హెచ్చరించారు. సందీప్‌రెడ్డికి 60 లక్షల సభ్యత్వం కలిగిన బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు అండగా ఉంటారని చెప్పారు. గత పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష నాయకులకు కూడా ప్రొటోకాల్ పాటించినట్లు ఆయన తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంటనే జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డికి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, హన్మంత్ వెంకటేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు ముక్కమాల బాలయ్య, వల్లపు రెడ్డి, తూం నాగార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, దొంత చంద్రశేఖర్ రెడ్డి, లోకసాని తిరుపతయ్య, రమావత్ దశ్రునాయక్, మల్లారెడ్డి, కేసాని లింగారెడ్డి, తరుపతయ్య, మోహన్, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, గాజుల ఆంజనేయులు, గోపిడి కృష్ణారెడ్డి, అరెకంటి రాములు, గోసుల అనంతగిరి, జనార్దన్ రావు, శంకర్ నాయక్, లోక్యానాయక్, గాడుల రాజేశ్, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు సహించం

• బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున
• నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ, జనవరి 30 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ డిమాండ్ చేశారు. బీబీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలపై ప్రశ్నించిన సందీప్‌రెడ్డిపై దాడి చేయించడంతోపాటు కేసీఆర్, కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 14ఏండ్లు అనేక పోరాటాలు చేసి.. కేసులు, జైలు జీవితం అనుభవించి స్వరాష్ట్రం సాధించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మాట్లాడే నైతిక హక్కు కోమటిరెడ్డికి లేదన్నారు. ఆనాడు వ్యక్తిగత కాంట్రాక్టుల కోసం మంత్రి పదవికి రాజీనామా డ్రామా ఆడి దొంగ దీక్ష చేపట్టిన చరిత్ర కోమటిరెడ్డిదని మండిపడ్డారు. రైతుబంధుపై మాట్లాడిన సందీప్‌రెడ్డిని వ్యక్తిగతంగా దూషిస్తూ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డికి కోమటిరెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా తన తీరును మార్చుకొని ప్రజాప్రతినిధులను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. లేదంటే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు నోముల శంకర్ యాదవ్, బాషబోయిన లింగస్వామి, క్రాంతికుమార్, గంట కిరణ్, గణేశ్, శ్రీకాంత్, నానియాదవ్, శివకుమార్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.




# పల్లెల్లో ప్రత్యేక అధికారులే

రేపటితో ముగియనున్న పంచాయతీ పాలక వర్గాల గడువు

• ఉమ్మడి జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలు
• పెద్ద గ్రామాలకు గెజిటెడ్, చిన్న గ్రామాలకు నాన్ గెజిటెడ్ ఉద్యోగులు
• గ్యారెంటీల అమలు తర్వాత ఎన్నికలకు వెళ్లే యోచనలో కాంగ్రెస్
• పదవీ కాలం ఆరు నెలలు పొడిగించాలని సర్పంచులు కోరినా పట్టించుకోని సర్కార్

నల్లగొండ, జనవరి 30 : గ్రామ పంచాయతీల్లో పాలక వర్గం పాలన ఈ నెలాఖరుతో ముగియనున్నది. ఫిబ్రవరి-1తో ఐదేండ్ల పాలన పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. మళ్లీ ఎన్నికలు జరిగే వరకు వారితోనే పాలన చేపట్టనున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇచ్చిన హామీల అమలు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నది. దాంతో ప్రత్యేక అధికారుల పాలనను తెరమీదకు తెచ్చింది. తమకు మరో ఆరు నెలలు అవకాశం ఇచ్చి, పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని సర్పంచులు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ పట్టించుకోలేదు. దాంతో ఫిబ్రవరి-1 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన రానుండగా సర్పంచుల ప్రాధాన్యం ఇక ఉండదు. పెద్ద గ్రామ పంచాయతీలకు గెజిటెడ్ అధికారులను, చిన్న పంచాయతీలకు నాన్ గెజిటెడ్ అధికారులను ప్రత్యేక అధికారులుగా ప్రభుత్వం నియమించింది.

### 2019 జనవరిలో జరిగిన ఎన్నికలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 844, సూర్యాపేటలో 475, యాదాద్రి భువనగిరిలో 421. ఆయా జిల్లాలో 2019 జనవరి 24, 27, 30 తేదీల్లో రెవెన్యూ డివిజన్ల వారీగా సర్పంచ్ ఎన్నికలు మూడు దఫాలుగా జరిగాయి. కొత్తగా ఎన్నికైన పాలక వర్గాలు ఫిబ్రవరి-2న సమావేశం నిర్వహించి కొలువు దీరినందున ఫిబ్రవరి-1తో వారి గడువు ముగియనుంది. ఆ లోపే ఈ దఫా ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ పలు కారణాల రీత్యా ఎన్నికలు జరుగలేదు. పాలక వర్గాల పాలన గడువు రేపు ముగియనుండడంతో ఈ నెల 2నుంచి ప్రత్యేక అధికారులకు పాలన బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది.

### పంచాయతీ కార్యదర్శులకు జత చేసి..

ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక పాలన షురూ కానుండడంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు ఒక ప్రత్యేక అధికారిని జత చేసి చెక్ పవర్ ఇచ్చి పాలన కొనసాగించనున్నారు. ఆయా గ్రామాల్లో జూనియర్, టైపిస్ట్ లాంటి అధికారులను కాకుండా కాస్త పెద్ద హోదా ఉన్న అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాలని కార్యదర్శులు ప్రభుత్వానికి విన్నవించారు. దాంతో పెద్ద గ్రామ పంచాయతీల్లో గెజిటెడ్ అధికారులు అంటే ఎంపీడీఓలు, తాసీల్దార్లు, ఎంపీఓలు, పలు శాఖల ఏఈలు, ఏఓలు, హైస్కూల్ హెచ్‌ఎంలను, చిన్న గ్రామ పంచాయతీల్లో సీనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులను నియమించనున్నారు.

### మరో ఆరు నెలల తర్వాతనే ఎన్నికలు

ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలవనుండగా మరో ఆరు నెలల తర్వాతనే రాష్ట్రంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నది. అప్పటి వరకు ప్రత్యేక అధికారులే పాలన చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టాల్సిన ఆరు గ్యారెంటీలపై మొదట దృష్టి పెట్టింది. ఆ గ్యారెంటీలు అమలు చేసే లోపే పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయి. పార్లమెంట్ ఎన్నికలు అయ్యాక కొత్త ప్రభుత్వం స్థానిక రిజర్వేషన్లు మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత పాత రిజర్వేషన్లే అయితే జూన్ లేదా జూలైలో ఈ పల్లె పోరు జరుగనున్నది. ఒక వేళ రిజర్వేషన్లు మార్చాలి అంటే మరోసారి చట్టం చేయాల్సి ఉండే అవకాశం ఉన్నందున మరికొంత ఆలస్యం కానుంది. ఇదిలా ఉండగా ఇదే సంవత్సరంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా జరుగనున్నాయి.



జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మౌనం పాటిస్తూ మహాత్ముడికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

## గాంధీకి ఘన నివాళి

నల్లగొండ, జనవరి 30 : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా బాపూజీకి ఘన నివాళులర్పించారు. నల్లగొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎంజీ యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాపూజీ స్వాతంత్రోద్యమ ఘట్టాలను గుర్తు చేసుకున్నారు.

## చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం



చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసానికి హాజరు కాని డైరెక్టర్లు


నేరేడుచర్ల, జనవరి 30 : నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి సహకార సంఘం చైర్మన్ అనంత శ్రీనివాస్ గౌడ్‌పై మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. చిల్లేపల్లి సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లకు గానూ ఒక డైరెక్టర్ కొండ పిచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందగా 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో పది మంది సంఘం డైరెక్టర్లు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్‌పై అవిశ్వాసం సమావేశం ఏర్పాటు చేయాలని ఈ నెల 8న జిల్లా సహకార సంఘం అధికారికి, కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. దాంతో ఈ నెల 30న అవిశ్వాసం ఏర్పాటు చేయనున్నట్లు డైరెక్టర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా సహకార సంఘం అధికారి ఎన్. శ్రీధర్, అసిస్టెంట్ రిజిస్టర్ పద్మజ, రాజేశ్వరి అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి 12 మంది సంఘం డైరెక్టర్లు గైర్హాజరు కావడంతో అధికారులు 11:30 గంటల వరకు వేచి చూసి అవిశ్వాసాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మరో ఏడాది పాటు అవిశ్వాసం ఏర్పాటు చేయడానికి ఈ సంఘం సభ్యులు అర్హత కోల్పోయినట్లు తెలిపారు. అవిశ్వాసంలో భాగంగా సహకార సంఘం వద్ద అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నేరేడుచర్ల, పాలకవీడు ఎస్ఐలు పరమేశ్, లింగయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మంత్రాల నెపంతో వ్యక్తిని హత్యచేసిన 14 మందికి జీవిత ఖైదు

మోటకొండూర్, జనవరి 30 : మంత్రాల నెపంతో వ్యక్తిని హత్య చేసిన 14 మందికి జీవిత ఖైదు విధిస్తూ భువనగిరి జిల్లా కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. మండలంలోని దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన సీసా యాదగిరి మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో అదే గ్రామానికి చెందిన 15 మంది 11ఆగస్టు, 2018న కట్టెలతో దాడి చేసి హత్య చేశారు. పోలీసులు పలు సెక్షన్లపై కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. ఈ కేసును విచారించిన కోర్టు నిందితులపై నేరం రుజువు కావడంతో 14 మందికి జీవితఖైదుతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చింది. ఈ కేసులో మొత్తం 15 మంది ఉండగా ఏ14 కావిటి కర్ణాకర్ మృతి చెందాడు. మిగిలిన బుర్రి రాజేశ్, చొప్పరి శ్రవణ్, చొప్పరి నరేశ్, చొప్పరి సత్యనారాయణ, చొప్పరి అంజమ్మ, చెక్క సత్యనారాయణ, దండు రవి, చొప్పరి శంకరయ్య, చొప్పరి మహేందర్, చొప్పరి సందీప్, చెక్క సత్తయ్య, మానెగల్ల పుల్లయ్య, చొప్పరి రోషయ్య, రాపాక లలితకు జీవితఖైదు పడింది.

## మా పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వండి

• జీఓ 81 అమలు చేయాలని అదనపు కలెక్టర్‌కు వీఆర్ఏల వినతి



నల్లగొండలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

నల్లగొండ, జనవరి 30 : జీఓ 81 ప్రకారం 61 ఏండ్లు నిండిన వీఆర్ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వీఆర్ఏలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 81 ప్రకారం రాష్ట్రంలో 20,500 మంది వీఆర్ఏలు ఉంటే.. 16,780 మందికి పోస్టింగ్ ఇచ్చారన్నారు. ఇంకా 3,797 మందికి ఇవ్వలేదని, నల్లగొండ జిల్లాలో 160 మందికి 61 ఏండ్లు దాటాయనే కారణంతో నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని తెలిపారు. 61 ఏండ్లు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ నియామకాలు ఇవ్వాలని గత ప్రభుత్వం జీఓ 81 ఇచ్చినప్పటికీ ఆరు నెలల నుంచి నియామక పత్రాలు ఇవ్వలేదన్నారు. వయస్సు, అనారోగ్యం కారణంగా తాము విధులు నిర్వహించలేకపోతున్నామని తెలిపారు. రెవెన్యూ శాఖలో 40 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న తమ పట్ల నిర్లక్ష్యం వహించరాదని, తమ వారసులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వీఆర్ఏలు కె.సత్తయ్య, మహబూబ్ అలీ, మంద వెంకయ్య, సుగుణమ్మ, విమలమ్మ, భిక్షమయ్య, ఇద్దయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలు చిరస్మరణీయం : ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేట సిటీ, జనవరి 30 : దేశం కోసం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సూర్యాపేట అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 11గంటలకు రెండు నిమిషాల పాటు సిబ్బందితో కలిసి మౌనం పాటించారు. అలాగే గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, ఏఓ సురేశ్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు రాజేశ్, లక్ష్మీనారాయణ, ఆర్ఐలు నారాయణరాజు, నర్సింహ, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



అమరవీరులను స్మరిస్తూ మౌనం పాటిస్తున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది



యాదగిరిగుట్ట ఆలయంలో స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవ

## యాదగిరీశుడికి వైభవంగా నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, జనవరి30 : యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామికి మంగళవారం నిత్యారాధనలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాత సేవను నిర్వహించారు. తిరువారాధనతోపాటు ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసి సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేశారు. సుదర్శన నారసింహ హోమం పాంచరాత్రగమ శాస్త్ర రీతిలో సా గింది. ఉదయం ఆలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ సుదర్శ నారసింహ హవనం జరిపారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని వీక్షించారు. ఆలయ ముఖ మండపంలో స్వామి వారికి సువర్ణ పుష్పార్చన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవ, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు ఘనంగా నిర్వహించారు. క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ ఆకుపూజ చేపట్టారు. క్యూకాంప్లెక్స్‌తోపాటు ప్రధానాలయంలో గల హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చన చేసి లలితా పారాయణం వినిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి.



బాసోనిబావి తండాలో మట్టి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

## బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

• ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

పెద్దవూర, జనవరి 30 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని కోమటికుంట, బాసోనిబావి తండాల్లో ఎమ్మెల్సీ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీ, బీటీ రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన మార్పును కాంగ్రెస్ ప్రభుత్వం గ్రహించాలన్నారు. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందని, ఇప్పుడున్న ప్రభుత్వం కనీసం రైతు బంధు ఇవ్వడానికి కూడా ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ గూడేలు, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పర్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను అనూరాధ, తిరుమలగిరి (సాగర్) ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, కేకే తండా సర్పంచ్ బాణావత్ శంకర్‌నాయక్, నాయకులు రమావత్ రవినాయక్, నడ్డి లింగయ్య పాల్గొన్నారు.